క్లుప్తంగా

కోటదుర్గ ఆలయంలో..



ప్రత్యేక అలంకరణలో కోటదుర్గమ్మ

వీరఘట్టం: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీకోటదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. విజయదశమి సందర్భంగా మంగళవారం ఉదయం 4 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ తెలిపారు. అమ్మవారికి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పూర్వం వీరఘట్టాన్ని పరిపాలించిన కొండరాజుల కోటలో కొలువుదీరిన దుర్గాదేవిని కోటదుర్గగా ఈ ప్రాంత ప్రజలు కొలుస్తుంటారు. ఐదు దశాబ్దాలుగా అమ్మవారికి తొలిపూజలు స్థానిక పోలీసులు చేస్తుంటారు.

పశుగ్రాసం కొరత

గరుగుబిల్లి: పాడిపశువులకు మేతగా వేసేందుకు పచ్చగడ్డి లభ్యం కాకపోవడంతో పశువుల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా భూమిలో తేమ తగ్గడంతో గడ్డి ఏపుగా పెరగలేదు. దీంతో ఈ ప్రాంతంలో పశువులు కడుపు నిండా మేసేందుకు గడ్డి దొరకక అర్ధాకలితో అలమటిస్తున్నాయి. గతంలో ఉన్న పచ్చిక బీడుభూములను చదును చేసి పంట పొలాలుగా మార్చేయడంతో పశువులను మేపేందుకు పచ్చిక బయళ్లు ఎక్కడా కనిపించడం లేదు. పశువుల పెంపకం కష్టంగా మారడంతో రైతులు వాటిని అమ్మేస్తున్నారు. పశుసంవర్ధకశాఖ ద్వారా సబ్సిడీపై పశుగ్రాసం సరఫరా చేయాలని కోరుతున్నారు.

జీఓ-3 అమలు చేయాలి



నిరసనలు వ్యక్తం చేసున్న ఆదివాసీ సంఘ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రం గుమ్మలక్ష్మీపురంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కొమరభీమ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షులు అమర్నాథ్, సూర్యనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 3 అమల చేయాలని డిమాండ్ చేశారు.

రాజారావు మృతికి సంతాపం

భామిని: మండలంలో బత్తిలికి చెందిన ఆలిండియా రేడియో మాజీ డీడీజే, ప్రస్తుత ఏపీ పైడి తెగ సంక్షేమం, సాధన సంఘ అధ్యక్షుడు పాలక రాజారావు(71) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో మార్నింగ్ వాక్ చేస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య పాలక ప్రమీలా గాంధీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.ప్రఫుల్లకుమార్, పైడి కుల సంఘ నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

ఘనంగా మిషన్ సండే

సీతంపేట: పత్తికగూడ సమీపంలో ఉన్న పాతిమా మాత చర్చిలో ఘనంగా మిషన్ సండే జరిపారు. ఈ సందర్భంగా ఫాదర్లు విద్యాసాగర్, స్లీవరాజులు మాట్లాడుతూ యేసు క్రీస్తు సువార్తను అందరూ ప్రకటించాలన్నారు. పునీత పోప్ సూచన మేరకు జ్వలించే హృదయాలు–ముందుకు సాగే అడుగులు అనే కాన్సెప్తుతో కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. పాపాల నుంచి పునీతులయ్యేందుకు యేసు క్రీస్తు సూచించిన మార్గాలు అనుసరణీయమన్నారు. పునీతపాలు జీవిత చరిత్రను నాటిక రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో మతకన్యలు ఝాన్సీ, సుదీప్త, విశ్వాసులు పాల్గొన్నారు.

పాలకొండ ఆర్డీఓగా లావణ్య

పాలకొండ రూరల్: పాలకొండ ఆర్డీఓగా ఎం.లావణ్యకు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహించిన నూరుల్‌కమర్ బదిలీపై ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా టెక్కలి సబ్‌కలెక్టర్‌గా వెళ్లడంతో ఈ పోస్టు ఖాళీ అయింది. ప్రస్తుతం విజయనగరం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారినిగా విధులు చేపడుతున్న లావణ్య తాజా జీఓ ప్రాప్తికి పాలకొండ ఆర్డీఓగా విధుల్లో చేరనున్నారు.

గోగు ఊరవేతలో రైతులు

గరుగుబిల్లి: గోగు ఊరవేత పనుల్లో మండలంలోని రైతులు బిజీగా ఉన్నారు. రైతులు మెట్టు పొలాల్లో గోగుపంట సాగుచేశారు. ప్రస్తుతం గోగు కర్రలను తీసి, చెరువుల్లో ఊరేస్తున్నారు. మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, గొట్టివలస, ఉల్లిభద్ర తదితర ప్రాంతాల్లో పలువురు రైతులు గోగుసాగు చేస్తున్నారు. సాగుఖర్చు పెరిగిపోవడం, గిట్టుబాటు ధర రాకపోవడంతో గోగు సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. చెరువుల్లో సరిపడా నీరు లేక పోవడంతో గోగుపంటను ఊరేసేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు అంటున్నార



పాలకొండ: రాజరాజేశ్వరీదేవిగా పాలకొండ కోటదుర్గమ్మ



వీరఘట్టం: భక్తుల చే పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ ఉత్సవ విగ్రహం



భామిని: గాజుల అలంకరణలో లలితాదేవీ అమ్మవారు



సీతంపేట: మల్లెమ్మతల్లి సన్నిధిలో సామూహిక కుంకుమ, కలశ పూజలు చేస్తున్న మహిళలు

దుర్గమ్మా.. కరుణించమ్మా..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తూ పూజలందుకుంటున్నారు. ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని సామూహిక కుంకుమ పూజలు చేశారు. పాలకొండలో కోటదుర్గమ్మ అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులచే పూజలందుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు కుటుంబ సభ్యులతో కలిసి కోటదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ మురళీకృష్ణ ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. భామినిలో లలితాదేవి అమ్మవారిని సహస్ర గాజులతో అలంకరించి పూజలు చేశారు.

\- సాక్షి నెట్‌వర్క్



పాలకొండ: కోటదుర్గమ్మను దర్శించుకున్న జేసీ గోవిందరావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ మురళీకృష్ణ



గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో మహిషాసురమర్థిని రూపంలో దుర్గాదేవి విగ్రహం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పాలకొండ: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎంతైనా ఖర్చు చేయడానికి వెనుకాడని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం, శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. వీరఘట్టం మండలం తలవరం గ్రామానికి చెందిన దేవకివాడ అక్కలనాయుడుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.4 లక్షల చెక్కును ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారుకు అందజేశారు. అక్కలనాయుడు 9 ఏళ్ల కుమార్తె గీతికా హైయాతి ఆనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలో చికిత్స పొందుతోంది. ఆమె వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి నుంచి గతంలో రూ.4.50 లక్షలు మంజూరు కాగా, తాజాగా మరో రూ.4 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా అక్కలనాయుడు, సీతాలక్ష్మి దంపతులు మాట్లాడుతూ.. తమ కుమార్తెకు అండగా ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి రుణపడి ఉంటామన్నారు. తమ పరిస్థితిని గుర్తించి సీఎం సహాయనిధి నుంచి రెండు విడతలుగా రూ.8.50లు మంజూరయ్యేలా కృషిచేసిన ఎమ్మెల్సీ విక్రాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న విక్రాంత్, రాజశేఖరం

కోటకొండ దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కోటకొండలో వెలసిన దుర్గమ్మ విగ్రహాలు

కురుపాం: మండలంలోని జి.శివడ పంచాయతీ గిరిశిఖర గ్రామమైన కోటకొండలో శత్రుచర్ల వంశీయుల ఆరాధ్య దైవం కోటకొండ దుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఏటా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నాడు జి.శివడ గ్రామం నుంచి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటకొండకు కురుపాం, భామిని మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ ఆలయాన్ని పునర్నిర్మించడంతో భక్తుల తాకిడి పెరిగింది.

కోటదుర్గమ్మకు వెండి హారతికుందు వితరణ

కురుపాం: మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వెలసిన కోటదుర్గమ్మ అమ్మవారికి స్థానిక వర్తకుడు బరాటం నేతాజీరావు కుటుంబ సభ్యులు రూ.7 వేలు విలువ చేసే వెండి హారతికుందును వితరణ చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసనాయిక్‌, కమిటీ సభ్యులకు ఆదివారం హారతికుందును అందజేశారు. అమ్మవారి పూజా కార్యక్రమాల్లో దాన్ని వినియోగించాలని కోరారు.

సోలార్ ట్యాంకులతో తాగునీటి సరఫరా

భామిని: మండలంలోని తివ్వాకొండ శిఖరాల్లోని గిరిజన గ్రామాల్లో సోలార్ పవర్‌తో పనిచేసే వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి అక్కడ నుంచి ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. కోటకొండ గిరిజన గూడలో ఆదివారం కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. రూ.5.5 లక్షలతో సోలార్ పవర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అలికాన సందీప్ తెలిపారు. కోటకొండతో పాటు ఎగువ పోలీస్‌కోట, బంద్రసింగి గ్రామాల్లో సోలార్ పవర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ ఖర్చు లేకుండా సులభంగా తాగునీరు సరఫరా చేసేందుకు సోలార్ ట్యాంకులు ప్రతిపాదించినట్లు తెలిపారు.



కోటకొండలో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ ట్యాంక్

నూతన వంగడాల సేద్యం



వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త తేజేశ్వరరావు

పాలకొండ రూరల్: మండలంలోని రుద్రిపేటకు చెందిన అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు ఈ ఏడాది ఖరీఫ్‌లో 1153 చంద్రరకం వరి సేద్యం చేశారు. 115 రోజుల కాలపరిమితితో అధిక దిగుబడి ఇచ్చే ఈ రకంపై పరిశోధన చేసేందుకు మార్తేరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కె.తేజేశ్వరరావు ఆదివారం రుద్రిపేట వచ్చారు. ప్రసాదరావు పంటపొలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రబీలో రైతులకు ఈ నూతన వంగడాలను విత్తనాలుగా చేసి అందించాలన్నారు. సాంబమసూరుకు బదులు వీటిని సాగు చేయవచ్చని సూచించారు. వీటితో పాటు నల్ల బియ్యం, ముంపు ప్రాంతాలకు అనువైన వంగడాలపై ఆరాతీశారు.

ముగిసిన దొరల దసరా వేడుకలు



పురాతన ఆయుధాలకు పూజలు చేస్తున్న కీర్తిరాయి దొరల కుటుంబ సభ్యులు

భామిని: భామిని కీర్తిరాయి దొరల దసరా వేడుకలు ఆదివారంతో ముగిశాయి. పర్లాఖిమిడి గజపతుల మోకాసా దారులుగా భామిని కీర్తిరాయి దొరలు వారసత్వాన్ని కొనసాగింపుగా పురాతన ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేశారు. కోటకొండ దుర్గమ్మకు కీర్తిరాయి దొరల వారసులు సాంప్రదాయ మొక్కులు సమర్పించి పూజలు చేశారు. ఏటా దసరా ముందు వచ్చే ఆదివారం దొరల దశరాగా చేయడం ఆనవాయితీ. వారం రోజులుగా సంబరాలు నిర్వహించారు. గుర్రాలపై కోటకొండకు పయనం, ఆయుధాలను ఊరేగింపుగా వంశధార నదికి వెళ్లి ప్రక్షాళన చేయడం ప్రత్యేకంగా సాగేవి.

ఎమ్మెల్యే పరామర్శ



జియ్యమ్మవలస: గంట సత్యంనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని శివిని గ్రామ సర్పంచ్ బోనెల పుష్పలత భర్త ఆనందరావు ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆదివారం పుష్పలతను పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబానికి అండగాఉంటామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, జిల్లా కార్యదర్శి శెట్టి మధుసూదనరావు, శివిని పీఏసీఎస్ అధ్యక్షుడు పప్పల గోపాలకృష్ణ, పలువురు సర్పంచ్‌లు ఉన్నారు.

తుంబలిలో..

జియ్యమ్మవలస: మండలంలోని తుంబలి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గంట సత్యంనాయుడు ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆదివారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, ఎటువంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, నాయకులు కోట రమేష్, మరడాన కిశోర్ ఉన్నారు.

పెండలం సీజన్ ప్రారంభం

- ఈ ఏడాది పెరిగిన దిగుబడులు
- మన్యం మార్కెట్‌లో విక్రయాలు
- ఒక్కో కట్ట రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయం

సీతంపేట: ఏజెన్సీలో పెండలం సీజన్ ఆరంభమైంది. నవంబరు నెలాఖరు వరకు సీజన్ ఉంటుంది. ఈ ఏడాది దిగుబడి పెరిగడంతో గిరిజన రైతులు ఆనందంగా ఉన్నారు. దుంపలను మన్యం మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి వాటిని కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు. పంట సాగుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేకపోవడంతో పెండలం సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖర్చులన్నీ పోనూ మంచి ఆదాయమే మిగులుతోందని అంటున్నారు.

వెయ్యి ఎకరాల్లో సాగు..

సీతంపేట, భామిని ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు వెయ్యి ఎకరాల వరకు కొండపోడు భూముల్లో పెండలం సాగు చేస్తున్నారు. పండిన దుంపలను కట్టలుగా కట్టి కావిడలతో మార్కెట్‌కు తరలిస్తారు. ఒక్కో కట్ట రూ.200 నుంచి రూ.300ల వరకు, బుట్టల చొప్పున అయితే ఒక్కో బుట్ట రూ.100 వరకు విక్రయిస్తుంటారు. వీటిని కొనుగోలు చేసిన వ్యాపారులు పట్టణాల్లోని మార్కెట్లలో కిలో రూ.90 వరకు విక్రయించి లాభాలు ఆర్జిస్తారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి పెండలం కొనుగోలు చేస్తారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, దోనుబాయిలో గురువారం, కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు గిరిజనులు పంటను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. గొయ్యిగూడ, పెద్దగూడ, సన్నంనాయుడుగూడ, పాంద్ర, కొండాడ, చింతాడ, మెట్టుగూడ, జగతపల్లి, అక్కన్నగూడ, బెన్నరాయి, గాటిగుమ్మడ, సీదిగూడ తదితర గ్రామాల్లో ఈ పంట ఎక్కువగా పండుతుంది.



వ్యాపారులు కొనుగోలు చేసిన పెండలం

వారపు సంతల్లో విక్రయం



ఏజెన్సీలో పండిన పంటలను వారపు సంతల్లో విక్రయిస్తాం. ఎంతో కష్టపడి కొండలపై నుంచి మోసుకుంటూ పంటను కిందకు తీసుకువస్తాం. ఇక్కడకు వచ్చాక గిట్టుబాటు ధర కూడా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

ఎస్.తేజ, అక్కన్నగూడ

తవ్వితీయడం చాలా కష్టం



కొండపోడు వ్యవసాయంలో పెండలాన్ని పండిస్తాం. ఎంతో శ్రమకోర్చి దుంపలను తవ్వి తీస్తాం. ఎకరా పోడు వ్యవసాయంలో పంట వేస్తే సుమారు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. దీని ద్వారా వచ్చిన ఆదాయంతో ఖరీఫ్‌లో వరిసాగు చేస్తాం. - **ఎస్.మోజేషు, జొగ్గినాయుడుగూడ**